క్లుప్తంగా

విద్యా సామగ్రి వితరణ



విద్యా సామగ్రి అందిస్తున్న ఎంఈఓ

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఆదర్శ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సరస్వతి మాత సాంఘిక సేవా సమాజం సహకారంతో 50 మంది విద్యార్థులకు ఏఈఓ హరిప్రసాద్ విద్యా సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లడుతూ దాతలు అందించే విద్యా సామగ్రిని విద్యార్థులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం వెంకమరాజు, రిటైర్డ్ ఎంఈఓ జయదేవ్, జయదేవ్‌రాజు, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందాం



మొక్కలు నాటుతున్న గాలి జ్యోతి

పాలసముద్రం : మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడుకుందామని సింగిల్‌విండో మాజీ అధ్యక్షురాలు గాలి జ్యోతి పిలుపునిచ్చారు. ఆమె శుక్రవారం శ్రీకావేరిరాజుపురం గ్రామ సచివాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం ఎక్కడ చూసినా చెట్లను విరివిగా నరికేస్తున్నారని తెలిపారు. అంతేగాక పరిశ్రమలు, వాహనాలు పెరుగుతుండడంతో వాతావరణ కాలుష్యం పెరుగుతుందన్నారు. దీన్ని నివారించి పర్యావరణాన్ని కాపాడుకోవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని సూచించారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది. సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనకు సహకరించాలి



మాట్లాడుతున్న ఎంపీడీవో పురుషోత్తం

వెదురుకుప్పం: సంపద అధికంగా ఉన్న కుటుంబాలు అట్టడుగున ఉన్న కుటుంబాలకు అండగా నిలవాలని ఎంపీడీవో పురుషోత్తం కోరారు. ఆయన శుక్రవారం వెదురుకుప్పంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో పీ4 సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో పేదరిక నిర్మూలనకు కృషి చేయాలన్నారు. అదేవిదంగా గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఓవర్ హెడ్ ట్యాంకులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసి నీటిని సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి డిప్యూటీ ఎంపీడీవో కొందరామిరెడ్డి, పీ4 సర్వే శిక్షకురాలు మాధురి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీ



దుండగులు ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్

పాలసముద్రం : మండలంలోని ఆముదాల దళితవాడకు చెందిన టీ మునస్వామి వ్యవసాయ పొలం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌ను గురువారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి రాగి వైరును చోరీ చేశారు. ఈ విషయాన్ని శుక్రవారం ఉదయం గమనించిన బాధిత రైతు లబోదిబోమంటున్నాడు. పంట చేతికందే సమయంలో ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేయడంతో పంట ఎండిపోతుందని వాపోతున్నాడు. విద్యుత్ శాఖ అధికారులు స్పందించి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి ఆదుకోవాలని కోరుతున్నారు.

ఎరువుల దుకాణంపై విజిలెన్స్ అధికారుల తనిఖీ



ఎరువుల దుకాణాన్ని తనిఖీ చేస్తున్న అధికారులు

గంగాధర నెల్లూరు : మండల కేంద్రమైన గంగాధర నెల్లూరులోని సింగిల్ విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎరువుల దుకాణాన్ని శుక్రవారం విజిలెన్స్ ఇన్‌స్పెక్టర్ వెంకటరవి, ఏడీ ధనుంజయ రెడ్డి తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. కాంప్లెక్స్ 352 బస్తాలు, డీఏపీ 370 బస్తాలు ఉన్నట్టు సిబ్బంది తెలిపారు. యూరియా కొరత అధికంగా ఉందని, రైతులు ఇబ్బందులు పడుతున్నారని అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారిణి భవాని, సొసైటీ సీఈవో విజయ్‌కుమార్‌రెడ్డి, స్టాఫ్ అసిస్టెంట్ మునస్వామి, సిబ్బంది హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

రోజాపై అనుచిత వ్యాఖ్యలు దారుణం

- మహిళలను రాజకీయంగా అణగదొక్కాలని చూడడం తగదు
- నగరి ఎమ్మెల్యే బేషరతుగా క్షమాపణ చెప్పాలి
- వైఎస్సార్ సీపీ జీడీనెల్లూరు ఇన్‌చార్జి కృపాలక్ష్మి డిమాండ్



మాట్లాడుతున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం : మహిళల రాజకీయ ఎదుగుదలను ఓర్వలేక వ్యక్తిగత దూషణలకు దిగడం తగదని వైఎస్సార్ సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆమె శుక్రవారం పుత్తూరులోని తన నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మాజీ మంత్రి రోజాపై నగరి ఎమ్మెల్యే భానుప్రకాష్ సభ్యసమాజం తలదించుకునేలా వ్యాఖ్యలు చేయడం దారుణమన్నారు. మంత్రిగా రోజా నగరి నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. ఆమెపై చేసిన వ్యాఖ్యలకు భానుప్రకాష్ బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మహిళలు ఎన్నో అవరోధాలు, అడ్డంకులను ఎదుర్కొని రాజకీయాల్లో రాణించాల్సి వుంటుందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మహిళలపై అఘాయిత్యాలు, దాడులు పెరిగాయని ఆరోపించారు. ఈ క్రమంలో వాటిని ఖండిస్తున్న మహిళా నాయకురాలు, మాజీ మంత్రి రోజాపై వ్యక్తిగత దూషణలకు దిగడం, చౌకబారు ఆరోపణలు చేయడం ప్రజాస్వామ్యం అనిపించుకోదన్నారు. గాలి భానుప్రకాష్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర వ్యాప్తంగా మహిళా లోకం ఖండిస్తోందన్నారు. అధికారం శాశ్వతం కాదని, భానుప్రకాష్ లాంటి వారికి ప్రజలు తగిన గుణపాఠం నేర్పడానికి సిద్ధంగా ఉన్నారని హెచ్చరించారు. అధికారాన్ని అడ్డుపెట్టుకుని ప్రతి పక్షనాయకులను, మహిళలను ఘోరంగా అవమానిస్తున్న గాలి భానుప్రకాష్‌పై నియోజకవర్గ మహిళలు తిరగబడే రోజులు దగ్గరలోనే వున్నాయన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రం అభివృద్ధిలో 20 ఏళ్లు వెనక్కి వెళ్లిందన్నారు. మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడం మాని, నియోజకవర్గ అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవుపలికారు.

అసభ్యకర పదజాలం తగదు



గోవర్ధననాయుడు

నగరి: మంత్రిగా, రెండు సార్లు ఎమ్మెల్యేగా సేవలు అందించిన రోజమ్మపై ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ అసభ్యకర వ్యాఖ్యలు చేయడాన్ని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి గోవర్ధన్ నాయుడు ఖండించారు. మహిళలపై తనకున్న అభిప్రాయాన్ని ఎమ్మెల్యే మార్చుకోవాలన్నారు. మాజీ మంత్రి ఆర్కే రోజా నియోజకవర్గంలో అభివృద్ధితోపాటు ఎందరో ఆకలిని తీరుస్తోందన్నారు. ఆమె కృషి, పట్టుదలతో ఈ స్థాయికి ఎదిగిందన్నారు. మహిళలను గౌరవించడం భారతదేశ సాంప్రదాయమని, అది మరిచి నీచంగా విమర్శించడం మన సంస్కృతిని కించపరచడమే అన్నారు.

ఎమ్మెల్యే క్షమాపణలు చెప్పాలి



భాస్కర్‌యాదవ్

పుత్తూరు: మాజీ మంత్రి ఆర్కే రోజాపైఅసభ్యకరంగా మాట్లాడిన నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ క్షమాపణలు చెప్పాలని వైఎస్ఆర్ సీపీ బీసీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి భాస్కర్‌యాదవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తమ నాయకురాలు రోజమ్మపై ఎమ్మెల్యే చేసిన వాఖ్యలను వైఎస్ఆర్‌సీపీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన రోజమ్మ నేటి రాజకీయాల్లో మహిళలకు స్ఫూర్తిదాయకంగా నిలిచారన్నారు. ఒక నటిగా, మహిళా నేతగా, సామాజికంగా, రాజకీయంగా గొప్ప స్థానాన్ని సంపాదించుకొన్న వ్యక్తిపై దుర్మార్గపు వ్యాఖ్యలు చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు.

మాజీ సర్పంచ్‌కు నివాళి



మునిరత్నం రెడ్డి భౌతికదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి నారాయణస్వామి, ఇన్‌చార్జి కృపాలక్ష్మి.



చిన్నిరెడ్డికి నివాళులర్పిస్తున్న నారాయణస్వామి, కృపాలక్ష్మి

వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో ఇటీవల మృతి చెందిన మాజీ సర్పంచ్ మునిరత్నం రెడ్డి కుటుంబాన్ని శుక్రవారం మాజీ ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, వైఎస్సార్‌సీపీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి కృపాలక్ష్మి పరామర్శించారు. మునిరత్నంరెడ్డి భౌతిక దేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మునిరత్నం రెడ్డి పచ్చికాపల్లం పంచాయతీ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. ద్రౌపదీ దేవి ధర్మరాజుల ఆలయానికి ధర్మకర్తగా వ్యవహరించి సేవలందించినట్లు గుర్తు చేశారు. అదేవిదంగా సంతబయలు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన మాజీ సర్పంచ్ పెద్దిరెడ్డి తమ్ముడు చిన్నిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించారు. చిన్నిరెడ్డి పార్థివ దేహంపై పూల మాల వేసి నివాళులర్పించారు. చిన్నిరెడ్డి భార్య, పిల్లలతో మాట్లాడి వారికి భరోసా ఇచ్చారు. ఆయన వెంట జెడ్పీటీసీ సుకుమార్, పార్టీ మండల అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, ఎంపీటీసీలు రాధిక, తోకలమురళీ రెడ్డి, మునిచంద్రారెడ్డి. ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు బట్టే సుబ్రమణ్యం, వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు బండి హేమ సుందర్ రెడ్డి, వైద్య విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు ప్రకాష్, గంగాధరనెల్లూరు నియోజకవర్గ బూత్ కమిటీ కన్వీనర్ నారాయణ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బండి గోవర్దన్‌రెడ్డి, మాజీ మండల యూత్ అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, మాజీ ఎంపీపీ జ్ఞానమ్మ, రైతు విభాగం మండల అధ్యక్షుడు ధనుంజయరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ లోకనాథరెడ్డి, మాజీ సర్పంచ్‌లు చిరంజీవిరెడ్డి, రమేష్‌రెడ్డి, విద్యార్థి విభాగం అధ్యక్షుడు జగదీశ్‌రెడ్డి, నాయకుల నాగరాజు, బొజ్జా రెడ్డి, విజయశేఖర్ రెడ్డి, వెంకటేశ్, రాజశేఖర్‌రెడ్డి ఉన్నారు. అదేవిదంగా మాజీ మంత్రి కుతూహలమ్మ కుమారుడు హరికృష్ణ కూడా పరామర్శించారు.

కర్షకుడికి తీవ్ర అన్యాయం



మాట్లాడుతున్న దయ్యాల రమేష్‌బాబు

కార్వేటినగరం: కూటమి ప్రభుత్వం పంటలకు గిట్టుబాటు ధర కల్పించకపోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని కాంగ్రెస్ పార్టీ జీడీనెల్లూరు నియోజకవర్గ ఇన్‌చార్జి దయ్యాల రమేష్‌బాబు ఆరోపించారు. ఆయన శుక్రవారం ఆ పార్టీ నాయకులతో కలిసి ఏబీసీ జ్యూస్ ఫ్యాక్టరీ వద్ద విలేకరులతో మాట్లాడారు. జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం మామిడికి రూ.5 మాత్రమే ఇస్తామని మొండికేస్తున్నట్టు ఆరోపించారు. తోటల నుంచి కాయలను ఫ్యాక్టరీల వద్దకు తరలించడానికి టన్నుకు రూ.2000లకు పైగా ఖర్చు అవుతుందని తెలిపారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుని గిట్టుబాటు ధర రూ.8, సబ్సిడీ కింద రూ.4 కలిపి రూ.12లు చెల్లించేలా చూడాలని డిమాండ్ చేశారు. కర్ణాటక రాష్ట్రంలో మార్కెట్ ఇంటర్‌వెన్స్(ఎంఐఎస్) పథకం కింద కేంద్ర ప్రభుత్వం కిలో మామిడిని రూ.16లతో 2.5 లక్షల టన్నులు కొనుగోలు చేసిందని తెలిపారు. ఇక్కడా ఆ విధానాన్ని కూటమి ప్రభుత్వం ఎందుకు అమలు చేయలేకపోతోందని దుయ్యబట్టారు. గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తున్న ధోరణితో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని, లేకుంటే ఫ్యాక్టరీల ఎదుట ధర్నాలు చేస్తామని హెచ్చరించారు. ఆయన వెంట దేశయ్య, శివప్రకాష్ మొదలియార్, గోవర్ధన్, మురళీ, పలువురు రైతులు ఉన్నారు.

ప్రత్యేక అవసరాలు గల పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి



రికార్డులను పరిశీలిస్తున్న మధు

కార్వేటినగరం: ప్రత్యేక అవసరాలుగల విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా సహిత విద్య సమన్వయకర్త మధు ఆదేశించారు. ఆయన శుక్రవారం కార్వేటినగరంలోని భవిత కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏఎస్‌వో బాషా మాట్లాడుతూ సహిత ఉపాధ్యాయులు ప్రత్యేక అవసరాల విద్యార్థులతో స్నేహభావంగా మెలగాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సహిత విద్య ఉపాధ్యాయురాలు సింధూజ, రేఖ పాల్గొన్నారు.

గురుపాద వార్షికోత్సవ వేడుకలు



నగరి: పట్టణ పరిధిలోని ఓంశక్తి ఆలయంలో 33వ గురుపాద వార్షికోత్సవ వేడుకలను పురస్కరించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక అలంకరణలు చేశారు. ఆలయం వద్ద భారీ ఎత్తున అన్నదానం, వస్త్రదానం చేశారు. పేదలకు పనిముట్లు, కుట్టు మిషన్లు, గ్యాస్ స్టవ్‌లు, రైతులకు స్ప్రేయర్లు, మహిళలకు రోజువారీ జీవనం కోసం ఇడ్లీ పాత్రలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా మరువత్తూర్ ఆదిపరాశక్తి ప్రచార కమిటీ అధ్యక్షుడు గంగాధరం, యాగ అధ్యక్షుడు సుబ్రమణ్యం, ఉపాధ్యక్షుడు ఉమాపతి, టీటీడీ ఆలయ అధికారులు వెంకటరమణ, గుణశేఖర్, ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

భూ ఆక్రమణ ఆరోపణలు అవాస్తం

తిరుపతి కల్చరల్: నారాయణవనం మండలం, ఎరుకంబట్టు లెక్క దాఖలాలోని సర్వే నంబర్లు 86/1,86/2,86/3లోని ఎకరా 83 సెంట్లు భూమిని కొందరు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారని ఆదే గ్రామానికి చెందిన పన్నీరు సెల్వం మరికొందరు చేసిన ఆరోపణలు అవాస్తమని భూ బాధితులు శశికుమార్, రానా పరశురాం తెలిపారు. శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పన్నీర్ సెల్వం తండ్రి చొక్కాలింగం మొదలియార్ నుంచి ఎంఆర్.రెడ్డి సదురు భూమిని కొనుగోలు చేసి ప్లాట్లు వేసి విక్రయించారని, 1985లో సుమారు 70 మంది ప్లాట్లను కొన్నారన్నారు. ఈ భూమిలోని ప్లాట్లలో తాము జేసీబీలతో చదును చేస్తుంటే తమను అడ్డుకోవడమేకాక తమపై దౌర్జన్యానికి దిగారని తెలిపారు. అంతేకాక ఎమ్మెల్యే కుమారుడు సుమన్ పంపడంతో కొందరు భూ ఆక్రమణకు పాల్పడుతున్నారని ఆరోపణలు చేయడం సరికాదని తెలిపారు. 40 ఏళ్ల క్రితం విక్రయించిన భూమిని తమదేనంటూ అడ్డుపడుతున్నారని వాపోయారు. దీనిపై సంబంధిత అధికారులు విచారణ చేసి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో ప్లాట్ల కొనుగోలుదారులు నిర్మల, జయలక్ష్మి, అగస్టీన్ శామ్యూల్, భక్తశీలన్, ధనంజయలు, గోవిందరెడ్డి, మునిక్రిష్ణయ్య పాల్గొన్నారు.

వైఎస్ఆర్ సీపీ నాయకుడి ఆటో దహనం



దుండగులు దహనం చేసిన షేర్ ఆటో

పుత్తూరు: మున్సిపాలిటీ 20వ వార్డు పరిధిలోని వినాయకపురం ఎస్టీ కాలనీకి చెందిన వైఎస్ఆర్ సీపీ నాయకుడు టి.రాజయ్య షేర్ ఆటోను గురువారం అర్ధరాత్రి గుర్తు తెలియని దుండగులు కాల్చివేశారు. రాజయ్య పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. వైఎస్ఆర్ సీపీ పట్టణ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్న రాజయ్య షేర్ ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ ఆటోను ఎఫ్‌సీ చేయడానికి రెండు రోజుల క్రితమే మరమ్మతులు, పెయింటింగ్ చేయించి ఇంటి వద్ద ఉన్న రేకుల షెడ్ కింద పార్క్ చేసి గురువారం రాత్రి ఇంట్లో నిద్రించాడు. రాత్రి 1.15 గంటల సమయంలో కాలుతున్న వాసనతో పాటు శబ్దం రావడంతో బయటి వచ్చి చూడగా అప్పటికే ఆటో అగ్నికి ఆహుతవుతూ కనిపించింది. చుట్టుపక్కల వారిని లేపి మంటలు ఆర్పడానికి ప్రయత్నించాడు. అప్పటికే ఆటోతోపాటు అక్కడే ఉన్న వైరు మంచం పూర్తిగా కాలిపోయాయి. తనపై ఉన్న రాజకీయ కక్షతోనే కొందరు ఉద్దేశపూర్వకంగానే తన ఆటోను కాల్చివేశారని ఫిర్యాదులో పేర్కొన్నాడు. గతంలోనూ ఓ కేసు విషయంగా తనను ఇబ్బంది పెట్టారని పేర్కొన్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అభ్యసన సామగ్రి పంపిణీ



అభ్యసన సామగ్రితో విద్యార్థులు

నగరి: మండలంలోని కృష్ణాపురం వెంగన్నకండ్రిగ గ్రామంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలకు పుత్తూరుకు చెందిన శ్రీసరస్వతి మాత సాంఘిక సేవా సంఘం వారు ఉచితంగా బ్యాగులు, ప్లేట్లు, నోటు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందించారు. శుక్రవారం పాఠశాలకు వెళ్లిన వారు ఎంఈఓ నమశ్శివాయం చేతుల మీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సభను ఉద్దేశించి ఎంఈఓ మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు పేద పిల్లల విద్యాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. దాతల సాయాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. శ్రీసరస్వతి సేవా మాత సాంఘిక సేవా సంస్థ సభ్యులు అమర్నాథరెడ్డి, ప్రధానోపాధ్యాయిని నిమ్మి, ఉపాధ్యాయులు వల్లియమ్మ, బాలసుబ్రమణ్యం రాజు, నాగరాజారెడ్డి, మునస్వామి, రాజకుమార్ తదితరులు పాల్గొన్నారు.

గ్రీన్ అంబాసిడర్ కుటుంబాన్ని ఆదుకుంటాం



మునస్వామి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న ఎంపీడీవో

పాలసముద్రం : చెత్త సేకరణ బండి కింద పడి కాళ్లు విరిగిన మండలంలోని కేజేపురం పంచాయతీ గ్రీన్ అంబాసిడర్ బలిజకండ్రిగ దళితవాడకు టి.మునస్వామి కుటుంబాన్ని అదుకుంటామని ఎంపీడీవో సతీష్ తెలిపారు. గ్రీన్ అంబాసిడర్ అధ్వాన పరిస్థితిపై సాక్షి దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దీనిపై స్పందించిన ఎంపీడీవో సతీష్ శుక్రవారం తన సిబ్బందితో కలిసి గ్రామానికి చేరుకుని మునస్వామిని పరామర్శించారు. మునస్వామి కాళ్లు విరిగిపోయిన విషయాన్ని జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి ఆదుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో మండల విస్తరణాధికారి సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శి శంకర్ పాల్గొన్నారు.


ప్లాస్టిక్ బదులుగా సంచులు వాడండి



మాట్లాడుతున్న కమిషనర్

నగరి: ప్లాస్టిక్ నిషేధం అమలులో ఉన్నందున ప్లాస్టిక్ స్థానంలో గుడ్డ సంచులను, పేపర్ సంచులను వాడాలని మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి అన్నారు. ప్లాస్టిక్ నిషేధంలో భాగంగా శుక్రవారం మున్సిపల్ కార్యాలయంలో వ్యాపార సంఘ ప్రతినిధులు, పారిశుధ్య కార్యదర్శులతో ఆయన సమావేశమయ్యారు. వ్యాపారులకు ప్లాస్టిక్ వాడడంతో జరిగే నష్టాలు, ప్రజలకు కలిగే హానిని వివరించారు. పర్యావరణానికి ప్లాస్టిక్ వలన ముప్పు ఉన్నందున కాలుష్య నియంత్రణకు దుకాణదారులు సహకరించాలన్నారు. ప్రజారోగ్యం దృష్ట్యా హోటల్ యజమానులు తమ హోటళ్లలో నిలువ చేసిన మాంసాహారాలు అమ్మ రాదన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే జరిమానాలు తప్పవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ పురుషోత్తం, పర్యావరణ పారిశుధ్య కార్యదర్శులు, ప్రజారోగ్యశాఖ మేస్త్రీలు పాల్గొన్నారు.

ఆరిమానిగంగమ్మకు ప్రత్యేక పూజలు



శ్రీరంగరాజపురం : మండలానికే తలమానికం అయిన తయ్యూరు పాయికట్టు ఆరిమాకులపల్లి గ్రామంలో వెలసిన ఆరిమానిగంగమ్మకు శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి అంబళ్లు పోసి నైవేద్యం సమర్పించారు. కర్ణాటక నుంచి వచ్చిన భక్తులు వినూత్న వేషధారణతో మొక్కులు చెల్లించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాకు హాజరైన నిరుద్యోగులు

నగరి: సూర్య జూనియర్ కళాశాలలో రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్చేంజ్, సీడాప్, డీఆర్‌డీఏ సంయుక్తంగా నిర్వహించిన జాబ్‌మేళాకు 400 మంది హాజరుకాగా 159 మంది ఎంపికైనట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి గుణశేఖర్ తెలిపారు. జాబ్‌మేళాకు బహుళ జాతీయ కంపెనీలు గ్రీన్‌టెక్ ఇండస్ట్రీస్, హీరో ల్యాబ్స్, శ్రీరామ్ చిట్స్ తదితర 20 కంపెనీలు పాల్గొన్నాయన్నారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ హాజరుకాగా మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, కళాశాల కరస్పాండెంట్ ప్రతాప్‌రాజు, కార్యదర్శి జయరామరాజు, ఏపీ ఎస్ఎస్‌డీసీ సిబ్బంది, కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

నిండ్ర: పరిసరాల పరిశుభ్రత పాటించడం అందరి బాధ్యత అని వైద్యాధికారి వినీషా అన్నారు. శుక్రవారం పరిసరాల పరిశుభ్రత పురస్కరించుకొని మండల కేంద్రంలో ఏఎన్ఎంలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జ్వరం అధిక రోజులు ఉంటే అది మలేరియా కావచ్చునని, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్ఓ శ్రీదేవి, సిబ్బంది సురేష్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పచ్చిరొట్టతో భూసారం పెంపు

నిండ్ర: మండలంలోని రైతులు ఖరీఫ్‌లో తమ పొలాల్లో జనుము, జీలగ తదితర పచ్చిరొట్ట సాగు చేయడంతో భూసారం పెరుగుతుందని మండల వ్యవసాయాధికారి తులసిరాం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో రైతులకు జనుము, జీలగ సాగుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రైతు జనుము సాగు చేయాలని అన్నారు. రబీలో వివిధ పంటలకు ఎంతో భూసారం పెంచేందుకు వీలుగా ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

ద్రౌపదీ ధర్మరాజుల హుండీ ఆదాయం రూ.10.38 లక్షలు



ప్రత్యేక అలంకరణలో శ్రీదౌపదీ అమ్మవారు

కార్వేటినగరం: మేజర్ పంచాయతీ కేంద్రమైన కార్వేటినగరంలో ఉన్న దౌపదీ, ధర్మరాజుల స్వామి ఆలయంలోని హుండీ నుంచి రూ.10,03,883 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధ్యక్షుడు రవియాదవ్ తెలిపారు. ఆలయంలో శుక్రవారం హుండీలోని కానుకలను లెక్కించారు. రవియాదవ్ మాట్లాడుతూ స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని కంకణాల ద్వారా రూ.3.12 లక్షలు, కానుల ద్వారా రూ.75,588, విరాళాలు, ఉభయదారుల ద్వారా రూ.6,16,295 ఆదాయం వచ్చిందన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాలకు రూ.7,08,513 ఖర్చులు పోను రూ.2,95,370 మిగిలినట్లు పేర్కొన్నారు. దీన్ని ఆలయ అభివృద్ధికి వెచ్చిస్తామని వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన కార్యదర్శి గౌతంరాజు, ఉపాధ్యక్షుడు కట్ల రవిరెడ్డి, కోశాధికారి లక్ష్మీపతి, ఉప కోశాధికారి సాయితాయల్ తదితరులు పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తేవాలి



మాట్లాడుతున్న హరిప్రసాద్‌రెడ్డి

గంగాధర నెల్లూరు: గ్రామ పంచాయతీల్లో ఏర్పాటైన చెత్త సంపద కేంద్రాలను వినియోగంలోకి తీసుకురావాలని డీపీఆర్సీ జిల్లా కోఆర్డినేటర్ హరిప్రసాద్ రెడ్డి ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రానికి తరలించాలన్నారు. అక్కడ వర్మీకంపోస్టు తయారు చేసి రైతులకు విక్రయించి ఆదాయం పొందాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శివయ్య తదితరులు పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల సీజ్



పోలీసు స్టేషన్ వద్ద ఉన్న ఇసుక ట్రాక్టర్లు

గంగాధర్ నెల్లూరు: మండల కేంద్రమైన గంగాధర నెల్లూరులోని నీవా నది వంతెన సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు సీఐ శ్రీనివాసంతి తెలిపారు. ముందుగా అందిన సమాచారం మేరకు శుక్రవారం దాడులు చేశామన్నారు. జీడీ నెల్లూరు వంతెన సమీపంలో ఇసుక తవ్వి తరలిస్తున్న ట్రాక్టర్లను సీజ్ చేసి రెవెన్యూ శాఖ అధికారులకు నివేదిక సమర్పించామని తెలిపారు.